# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MAY - 2000

# రేడియో శ్రీలంక ద్వారా
# క్రీస్తు సంఘముల సువార్త ప్రసార కార్యక్రమములు

తెలుగు : **సత్యవాణి**
ప్రతి ఆది, మంగళ, బుధ, గురు వారాల్లో
మధ్యాహ్నం 2-00 గం॥ల నుండి 2-15 వరకు.
ప్రసంగీకులు : **జాషువా గూటం**, కాకినాడ.

హిందీ : **సత్య సుసమాచార్**
ప్రతి ఆదివారం రాత్రి 8-45 నుండి 9-00 వరకు
ప్రతి గురువారం రాత్రి 9-00 నుండి 9-15 వరకు
ప్రసంగీకులు : **సన్నీ డేవిడ్**, న్యూఢిల్లీ.

తమిళం : **సత్యవాజి**
ప్రతి ఆదివారం సాయంత్రం 6-45 నుండి 7-00 వరకు, మంగళవారం, శుక్రవారం సాయంత్రం 5-30 నుండి 5-45 వరకు గురువారం సాయంత్రం 5-45 నుండి 6-00 వరకు.
ప్రసంగీకులు : **పి.ఆర్. స్వామి**, బెగుళూరు.

మళయాళం : **ది వోయిస్ ఆఫ్ ట్రూత్**
ప్రతి శుక్రవారం సాయంత్రం 3-45 నుండి 4-00
ప్రసంగీకులు : **పి.కె. వర్గీస్**, తిరువనంతపురం.

కన్నడ : **The voice of truth**
ప్రతి ఆదివారం మధ్యాహ్నం 1-45 నుండి 2-00 వరకు
ప్రసంగీకులు : **రోబర్ట్ రత్నాకర్**, బెంగుళూరు.

ఇంగ్లీషు : **The voice of truth**
ప్రతి శుక్రవారం సాయంత్రం 7-45 నుండి 8-00 వరకు
ప్రసంగీకులు : **జె.సి. ఛోట్**, అమెరికా.

పై కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి.

ఉచిత బేసిక్ బైబిల్ కోర్సులోని పాఠముల కొరకు ఈ రోజే మాకు వ్రాయండి.

**SATYA VAKKU**

P.O. BOX 80, KAKINADA - 533 001. • Phone : 0884 - 363722

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 20 మే 2000 సంచిక 10


## దేవుని కృప వలన ఎవరు రక్షింపబడుదురు ?
### ( Who is Covered by the Grace of God ? )

కృప అనగా అర్హులు కాకపోయినను దేవుడు మానవుల యెడల కనుబరచు మంచితనము, దయ యని మనం చెప్పుకొనవచ్చును. ఇంకో మాటలో మనము రక్షించుకొనలేని స్థితిలో యుండగా దేవుడే మనలను రక్షించును. ఆయన మనకు చేసిన మేలుకు ప్రతిఫలముగా ఆయనకు ఏమి యిచ్చినను సరిపోదు. రక్షించబడడానికి ఆయన యిచ్చిన ఆజ్ఞలన్నియు మనం నెరవేర్చినను, మనం రక్షించబడితే ఆయన కృపవలననే రక్షించబడుదుము, నిత్యజీవ నిరీక్షణను కలిగియుందుము.

పరిశుద్ధాత్మ ప్రేరణ వలన అపొస్తలుడైన పౌలు యిట్లు వ్రాసెను : "మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదు గనుక ఎవడును

అతిశయపడ వీలులేదు" (ఎఫెసీ 2:8,9). మానవుడు తన్ను తాను రక్షించుకొనలేడని ఈ మాటల వలన తెలియనగును. అంతేకాదు రక్షణను సంపాదించుకొను నిమిత్తము పుణ్యా కార్యములు ఎన్ని చేసినను సరిపోవు. అది క్రియల వలన కలిగినది కాదు. అట్లు కలిగేదయితే దేవుని అవుసరం లేకుండానే తన్ను తాను రక్షించుకో గలిగానని మానవుడు అతిశయించును. సరిగదా, రక్షణ దేవుని వరమే యని పౌలు ప్రకటించాడు. దేవుడు మాత్రమే ఇయ్యగలిగినది అది. ఆయన కృప వలన మనము రక్షింపబడుదుము !

మానవుడు కృపవలన రక్షింపబడినను, అతడు కృపవలన మాత్రమే రక్షింప బడడు. రక్షణ కృప వలన మాత్రమే అయితే మానవులందరు రక్షింపబడుదురు. ఏలయనగా దేవుడు అందరినీ ప్రేమించును, క్రీస్తు అందరి కొరకు చనిపోయెను. అయితే, "మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా గాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగ జేయుట ద్వారాను మనలను రక్షించెను" (తీతు 3:5).

ఎఫెసీ పత్రికలోను, తీతు పత్రికలోను ఉన్న లేఖనములను పోల్చి చూచిన యెడల మన పుణ్యా కార్యముల వలనగాని, మోషే ధర్మశాస్త్ర క్రియల వలన గాని రక్షింపబడలేమని దేవుడు చెప్పుచున్నట్లు గ్రహించగలము. ఏలయనగా రక్షణ దేవుని కృపవలన కలుగును. అయినను, రక్షణ షరతుల పూర్వకమైనది. "పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారా"... అని తీతు పత్రికలో చెప్పబడింది. యిది బాప్తిస్మములో మనము పొందే ఆత్మీయ స్నానము. మరల "పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగ జేయుట ద్వారా"... అనగా పరిశుద్ధాత్మ అను వరము ద్వారా. అంటే ఈ నూతన జీవితము, పరిశుద్ధాత్మ అను వరము అపొ.కా. 2:38లో చెప్పబడిన బాప్తిస్మము ద్వారా పొందుదుము.

పేతురును, మిగిలిన అపొస్తలులును పెంతెకొస్తు దినమున యెరూషలేములో వేలకొలది యున్న ప్రజలకు బోధించి యేసే దేవుని కుమారుడని వారికి నిరూపించగా, వినిన వారు విశ్వసించి అయ్యలారా, మేమేమి చేతుము అని ప్రశ్నించారు. "పేతురు-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని వారికి చెప్పెను (అపొ.కా. 2:38).

ప్రభువు యొక్క ఆజ్ఞలకు విధేయత చూపించుటకై ఒకని రక్షణ ఆధారపడి యున్నదని ఈ లేఖన భాగము యొక్క అర్ధము. లేఖనములలో చెప్పబడినదాని నంతటినీ ఒకడు చేసిన తరువాత, అక్కడ నుండి దేవుడు గైకొని అతని తన కృప వలన తన గత పాపముల నుండి రక్షించును. అంటే మారుమనస్సు పొందిన, విధేయత చూపించిన విశ్వాసిని దేవుడు తన కృపను ప్రోక్షించి రక్షించును.

అయితే దేవునికి విధేయత చూపని వాని సంగతి యేమిటి ? అతనినికూడ తన పాపములలోనే దేవుడు కృప వలన రక్షించునా ? లేనేలేదు. దేవుడు కూడ తన లేఖనములకు బద్ధుడై యుండి, లేఖనములకు విరుద్ధముగా ప్రవర్తింపరు. ఆ లేఖనములేమి చెప్పుచున్నవంటే, దేవుని పక్షమున కృపయు, మానవుని పక్షమున విధేయతయు ఉండవలెనని చెప్పుచున్నవి. ఆ విశ్వాసము విధేయత చూపించునట్టిదై యుండవలెను. ఈ రెండును సమిష్టిగా పనిచేస్తేనే గాని, దేవుని కృప విస్తరింప జాలదు.

ఈ లేఖనములను బట్టి దేవుని కృప అందరికీ వర్తించదు, వర్తింపజాలదు అని గ్రహించుకోగలము. ఆయనయందు విశ్వాసముంచి, ప్రేమించి ఆయనకు లోబడు వారికే అది వాగ్దానము చేయబడినది. అట్టి వారిని ఆయన రక్షించి, తన కుటుంబమైన సంఘముతో చేర్చును.

ఒకడు తన గత పాపముల నుండి రక్షింపబడిన తరువాత, తన జీవిత కాలమంతయు దేవుని కుటుంబములో నమ్మకముగా యుంటే నిత్య రక్షణకు

అర్హుడగును. రక్షణ ఎప్పుడు బేషరతుగా వాగ్దానము చేయబడలేదు గాని, ప్రకటన 2:10లో చెప్పబడినట్లు ఒకడు మరణ పర్యంతము నమ్మకముగా యుంటే, అతడు నిత్యజీవ కిరీటమును పొందును.

ఒకని నమ్మకత్వము (Faithfulness) అతని రక్షించినదని దీని యర్థము కాదు. లేదా నమ్మకత్వముతో సరిపడినన్ని నీతి కార్యములు చేసెనని కూడా కాదు. గాని అతని నమ్మకత్వము వలన తండ్రి వలన కలిగిన కృపకు అర్హునిగా తన్ను తాను తయారు చేసుకొనెనని దీని యర్థము.

యోగ్యులైన మంచి మనస్సు కలిగిన వారందరు, వారు క్రీస్తు సంఘములో లేక పోయినను, దేవుని కృపవలన రక్షించబడుదురు అని కొందరు తలంచుదురు. (విశ్వాసము, కృపలను గూర్చి లేఖనముల నెరుగని కొందరు క్రీస్తు సంఘస్థులు కూడ ఈలాగు తలంచేవారిలో లేకపోలేదు). అది విచారకరము. వారి ఉద్దేశ్యము ఏమంటే-క్రైస్తవులు పరిపూర్ణులు కాదు, వారు కూడ రక్షించబడుటకు దేవుని కృప మీదనే ఆధారపడాలి. ఆలాగే యితర మతస్థులు, మతశాఖల వారు కూడ పరిపూర్ణులు కాదు గనుక వారు కూడ దేవుని కృపవలననే రక్షింపబడుదురు.

ఈ రకమైన ఆలోచన సరళి గలిగిన వారు ఒక ముఖ్యమైన వాస్తవమును మరతురు! మొదట్లో రక్షింపబడాలంటే దేవుని చిత్తమునకు వీరు లోబడలేదు; వారు విశ్వాసము, మారుమనస్సు విధేయతల ద్వారా దేవుని కుటుంబములో తిరిగి జన్మించిన వారు కాదు. దేవుని ఏకైక కుటుంబమైన సంఘములో వారు సభ్యులు కారు. ఆయన కుటుంబములో లేరు గనుక వారు దేవుని కృపలో లేరు. ఒకడు దేవుని కుటుంబములోనా ? లేక దాని వెలుపల యున్నాడా ? యనునదియే వ్యత్యాసము.

నీవు క్రైస్తవుడవా ? క్రీస్తు సంఘ సభ్యుడవా ? కానట్లయిన దేవునికి లోబడి ఆయన కృపకు పాత్రుడవు కమ్ము !!

- జె.పి. భోట్

(World Evangelism Tracts).

5.

# మీరు క్రైస్తవులను చూచారా ?

తెల్లని అంగీ ధరించి మెడలో ఓ సిలువ బొమ్మను వ్రేలాడేసుకొని చేతిలో జపమాలను త్రిప్పుతూ కన్పించే వారిని క్రైస్తవులు అని పరిగణిస్తున్నారు భారతీయులు. హిందువులలో మతశాఖలున్నట్లే క్రైస్తవులని పిలువబడుతున్న వారిలోను శాఖోపశాఖలున్నవని వారిలో వారికి ఐక్యత లేదని ఆకాశవాణి వారు ప్రసారం చేసిన "మతసామరస్యం" అనే అంశం మీద ఒకానొక వక్త వక్కాణించారు. "వ్రాయబడిన ప్రకారము మిమ్మును బట్టియే గదా నా నామము అన్య జనుల మధ్య దూషింపబడుచున్నదని" (రోమా 2:24) లేఖనము తెలుపునది నిజమే మరి.

నుదుట బొట్టు చేతులకు గాజులు వెండి బంగారు నగలు తీసివేసినంత మాత్రమున వారు క్రైస్తవులు కానేరరు. గృహశుభ్రత కలిగి గోడల మీద వాక్యపు అట్టలు బైబిల్ లవర్స్ క్యాలెండర్లు వ్రేలాడేసి ఆరాధనలకు మందిరములు నిర్మించుకొని చేతిలో బైబిలు విడువక మేమే పరిశుద్ధులమన్నట్లుగా యిదయ్యి పోయే సహోదరులనబడువారు క్రైస్తవులు కారు. పక్కా బిల్డింగులు పర్మినెంటు చర్చ్‌లు నిర్మాణం చేసుకొని పండుగలు-లెంటులు ఆచరిస్తూ మాది తల్లి సంఘము అని చెప్పుకొంటూ ఉప్పొంగిపోయే ఉల్టా సీదా భక్తవరులు ఆరాధనలో ఓ రకమైన ఎక్సర్‌సైజు కార్యక్రమం జరిగించేవారు క్రైస్తవులు కారు.

క్రైస్తవులు మెడలో సిలువ ధరించరు. గుడిలో సిలువ పెట్టరు, గృహాల్లో సైతం సిలువ పటములు ప్రదర్శింపరు. వారి గుండెల్లోనే మర్మమైన సిలువ ఉంటుంది. అది మంచిని చెడును విమర్శిస్తూ మానవతా విలువలు కాపాడుకొమ్మని హెచ్చరిస్తూంది. బొమ్మల పూజ యావత్తు విగ్రహారాధనయే. సిలువ ఓ విగ్రహముగ క్రైస్తవులనబడువారి ద్వారా పూజలందుకొంటుంది. ఇదెంత సిగ్గు విషయము !

యేసుక్రీస్తు ప్రభువు చివరిసారిగా అపొస్తలులనబడిన తన శిష్యులకు ఆజ్ఞాపించిన దేమనగా "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను

ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. -మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి (మార్కు 16:16, మత్తయి 28:19). అపొస్తలులు ప్రకటించిన సువార్త ప్రకారం రక్షింపబడినవారు శిష్యులని పిలువబడిరి. "మొట్ట మొదట అంతియొకయలోని శిష్యులు క్రైస్తవులనబడిరి (అపో.కా. 11:26). పౌలు భక్తుని ఉపదేశం ప్రకారం "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవారు క్రీస్తును ధరించు కొనియున్నారు" (గలతీ 3:27). వెండి బంగారములు యితర లోహములతో క్రీస్తు బొమ్మలు సిలువ బొమ్మలు వీరు ధరించుట లేదా ఏదైనా స్థలములలో ప్రతిష్టించుట చేయలేదు. క్రీస్తును ధరించుకొనుటయనగా క్రీస్తును అనుకరించుట ఆయన ఆజ్ఞలు గైకొనుట, లేదా క్రీస్తు అడుగుజాడలలో (1పేతురు 2:21-23) నడుచుకొనుట యని గ్రహించవలెను.

క్రైస్తవుడనే పేరుతో పిలువబడెడివాడు నరహంతకుడిగా, దొంగగా, దుర్మార్గుడిగా పరుల జోలికి పోవువాడుగా ఉండకూడదు (1పేతురు 4:12-19). ఎఫెసీ5:1-5, కొలస్స 3:1-10 వచనముల ప్రకారము పరిశుద్ధులుగా ఉండవలెను. క్రీస్తు వలె ఉండగోరిన వాడే క్రైస్తవుడు. క్రీస్తు నామమునకు మహిమ తెచ్చుటకే క్రైస్తవుడు లేఖనానుసారముగా జీవించవలయును. పౌలు తిమోతికి వ్రాసిన పత్రికలోల ఈ మాటను గమనించండి. "క్రీస్తుయేసు నందు సద్భక్తితో బ్రదుకనుద్దేశించు వారందరు హింస పొందుదురు" 2తిమో 3:12 ప్రభువైన యేసు మాటలు పరికింతము:- నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. నీతి నిమిత్తము హింసింపబడు వారు ధన్యులు పరలోక రాజ్యము వారిది (మత్తయి 5:10-11). నన్ను వెంబడింప గోరువాడు తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింప వలెను (మత్తయి 16:24). తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు (లూకా 14:27). ఈ మాటలను ఆధారము చేసికొని కొందరు మత గురువులు ప్లై ఉడ్‌తో పొడవాటి సిలువను చేయించుకొని భుజం మీద పెట్టుకొని వీధులందు తిరుగుచుండుట శోచనీయము.

క్రీస్తును వెంబడించువారు శిష్యులనబడిరి. ఆ శిష్యులనే క్రైస్తవులని పిలిచిరి. వారు క్రీస్తు యేసు సంబంధులు. సువార్త విని, విశ్వసించి, విధేయులై పాప క్షమాపణ కొరకు బాప్తిస్మము పొంది రక్షింపబడినట్టి వీరు క్రీస్తు యేసు సంబంధులు. క్రైస్తవులు-శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువ వేసియున్నారు (గలతీ 5:24). వీరు క్రీస్తును అనుకరించి క్రీస్తు బోధను అనుసరించి జీవింతురు. ఇదే క్రైస్తవ జీవితము. "మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును ద్వేషించు వారికి మేలు చేయుడి, మిమ్మును శపించువారిని దీవించుడి, మిమ్మును బాధించు వారి కొరకు ప్రార్థన చేయుడి, మనుష్యులు మీకేలాగు చేయవలెనని మీరు కోరుదురో ఆలాగు మీరును వారికి చేయుడి (లూకా 6:27-38). ఇదే క్రైస్తవ రీతి మరియు నీతియునై యున్నది.

నిజమైన క్రైస్తవ భక్తి :- దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి ఇబ్బందిలో పరామర్శించుటయు ఇహలోక మాలిన్యము తనకంటకుండ తన్ను తాను కాపాడు కొనుటయునై (యాకోబు 1:27).

క్రైస్తవ ఆరాధన :- దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను (యోహాను 4:24). నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను (మత్తయి 22:37). ఇందు విగ్రహ రూపమునకు తావులేదు (యెషయా 40:18). క్రీస్తు సూక్తి; నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను (మత్తయి 19:19). ఇప్పుడు మీరు లేఖనములను పరిశీలించి క్రైస్తవులు ఎలాగుంటారో చెప్పగలరు. లేఖన విరుద్ధముగా నుండువారు వేషధారులని వేరే చెప్పవలెనా ?

- యస్.జె. మేడిది, కొణితివాడ.

# 8.
# ఐక్యత
## (unity)

"సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంతమేలు ఎంత మనోహరము. అది తలమీద పోయబడి అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచునకు దిగజారిన పరిమళ తైలమువలె నుండును. సీయోను కొండలమీద దిగివచ్చు హెర్మోను మంచువలె నుండును; ఆశీర్వాదమును-శాశ్వత జీవమును-అచ్చట వుండవలెనని యెహోవా సెలవిచ్చి యున్నాడు" (కీర్తనలు 133:1-3).

ఆశీర్వాదమును, శాశ్వత జీవమును, సహోదరులకు వుండవలెనన్న వారు (సహోదరులు) ఐక్యత కలిగి వుండవలెను.

"ఐక్యత" అనునది పరిమళ తైలముతో పోల్చబడినది

"ఐక్యత అనునది హెర్మోను మంచువలె పోల్చబడినది.

"ఐక్యత"గా వుంటే మనోహరము, మేలును అచ్చట వుండును. గనుక సహోదరులు "ఐక్యత" గా వుండవలెనని హెచ్చరించబడినది.

**యేసు ఐక్యతను గూర్చి పలికిన మాటలు :**

"తండ్రీ, నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున వారును మన యందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రమే నేను ప్రార్థించుటలేదు. వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఐక్యమై యుండ వలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను-మనము ఐక్యమై యున్నలాగున వారును ఐక్యమై యుండవలెనని నీవు నా కనుగ్రహించిన మహిమను నేను వారికిచ్చితిని" (యోహాను 17:20-22).

తండ్రి, కుమార, పరిశుద్ధాత్ములు "ఐక్యత" గలిగియున్నారని యీ క్రింది వాక్యము ద్వారా మనకు తెలియుచున్నది.. "దేవుడు - మన స్వరూపమందు మన పోలికచొప్పున నరులను చేయుదము..." (ఆది 1:26). గనుక తండ్రియైన

దేవుడు - కుమారుడైన దేవుడు - పరిశుద్ధాత్ముడైన దేవుడు ఐక్యత కల్గియే సర్వసృష్టిని చేసిరి (యోహాను 1:1,2; ఆది 1:1,2).

ఒకరు యస్ అంటే ఇద్దరు కూడా యస్- ఒకరు నో అంటే ఇద్దరు కూడా నో. గనుక సహోదరులు కూడ ఐక్యతగల్గి వుండవలయుననునది దేవుని చిత్తమై యున్నది. "ప్రభువా, ప్రభువా! అని నన్ను పిలుచు ప్రతివాడు పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21).

సహోదరులు ఐక్యత గల్గియుండుట దేవుని చిత్తమైయున్నది. ప్రేమలేనిదే ఐక్యతగా వుండలేరు. సహోదరులు ఒకరినిఒకరు ప్రేమించుకొనినచో ఐక్యత గా వుండగలరు.

"దేవుడు ప్రేమస్వరూపి" (1యోహాను 4:8). "ఆయనను ఎరిగి యున్నామని చెప్పుకొనుచు ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు. వానిలో సత్యము లేదు. ఆయన వాక్యము ఎవడు గైకొనడో వానిలో సత్యము లేదు. ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో దేవుని ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను. ఆయన యందు నిలిచియున్న వాడనని చెప్పుకొనువాడు ఆయన యేలాగు నడుచుకొనెనో ఆలాగుననే నడచుకొనబద్ధుడై యున్నాడు. మనమాయనయందు వున్నామని దీనివలన తెలిసికొనుచున్నాము" (1యోహాను 2:4-6). "మీరు ఏకమనస్కులగు నట్లుగా ఏక ప్రేమ కలిగి, యేకభావము గలవారుగా వుండి, ఒక్కదానినే మనస్కరించుచూ నా సంతోషమును సంపూర్ణము చేయుడి. కక్షచేతనైనను- వృథాతిశయము చేతనైనను ఏమియూ చేయక, వినయమైన మనస్సు గలవారై యొకనికొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు, మీలో ప్రతివాడును తన స్వకార్యములను మాత్రమే గాక, యితరుల కార్యములను కూడ చూడవలయును. క్రీస్తు యేసునకు గల్గిన యీ మనస్సు మీరును కల్గియుండుడి (ఫిలిప్పీ 2:2-5). నిజముగా క్రీస్తు ప్రేమను కలిగి యున్నచో సహోదరులలో ఐక్యత వుండును.

ఐక్యత ఎక్కడ వుండదో అచ్చట దేవుని **ఆశీర్వాదములను శాశ్వత జీవమును** కోల్పోవుదురు. సహోదరులలో ప్రేమయున్నప్పుడే ఐక్యత వుండును. గనుక సహోదరులు ప్రేమించుకొనవలయును. ఆయన మన నిమిత్తము ప్రాణము పెట్టెను. గనుక దీనివలన ప్రేమ ఎట్టిదో తెలిసికొనుచున్నాము. "మనము కూడా సహోదరులు నిమిత్తము మన ప్రాణములను పెట్టబద్ధులమైయున్నాము" (1యోహాను 3:16).

ఆహా! మొట్టమొదటి క్రీస్తు సంఘములో ఎట్టి ప్రేమ యున్నదో గదా! అట్టి ప్రేమయే యిప్పటి క్రీస్తు సంఘములో వుండవలెను. నీవు దేనిని విత్తితే దానిని కోయుదువు (గలతీ 6:7) వాక్యము విత్తనమై యున్నది (లూకా 8:11). గనుక ఆనాటి క్రీస్తు సంఘమును విత్తితే యిప్పుడూ ఆ సంఘమే యుండును. ఆనాటి క్రీస్తు సంఘము ఐక్యతను కోరుచున్నది. అనగా ఒకరినొకరు ప్రేమించ వలయుననునదియే. క్రీస్తు సంఘములో విభజనలు ఉండకూడదు. "క్రీస్తు విభజింపబడి యున్నాడా ?......" (1కొరింథీ 1:13). "మీలో ఒకడు-నేను పౌలువాడను, ఒకడు నేను అపొల్లోవాడను మరియొకడు నేను కేఫావాడను, ఇంకొకడు-నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచున్నారని నా తాత్పర్యము" (1కొరింథీ 1:12). "ఒకడు నేను పౌలు వాడను మరియొకడు నేను అపొల్లోవాడను అని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధులైన మనుష్యులుకారా ?" (1కొరింథీ 3:4).

క్రీస్తు సంఘములో విభజనలు ఉండిన యెడల అట్టివారు ప్రకృతి సంబంధులు, శరీర సంబంధులైన వారై యున్నారు (1కొరింథీ 3:3). "కాబట్టి యెవడును మనుష్యులయందు అతిశయింపకూడదు..... మీరు క్రీస్తువారు..... క్రీస్తు దేవునివాడు" (1కొరింథీ 3:21-23). ఈనాటి క్రీస్తు సంఘములు కొందరి వ్యక్తుల మీద ఆధారపడి నడచుచుండుట-దేవుని వాక్యమునకు వ్యతిరేకము. ఆవ్యక్తులను ఆధారము చేసుకొని గ్రూపుల వారీగా ఉండుట దేవుని చిత్తము కాదు. ఇలా గ్రూపుల వారీగా ఉండుట ద్వారా ఈనాటి క్రీస్తు సంఘములలో

ఐక్యత లోపించినది ప్రేమ కనబడుటలేదు. నామమాత్రమే క్రీస్తుసంఘములుగ వున్నవి గాని సహోదర ప్రేమ లేదు.

ఆ గ్రూపుల వారు బైబిలును అనుసరించుటలేదు. తమ యిష్టము వచ్చినట్లు నడచుచున్నారు. (అనగా స్టేటు డైరక్టర్లు యని, ఇండియా డైరక్టర్లు యని, ప్రపంచ సువార్తికులు యని, రాష్ట్ర సువార్తికుల యని) ఆత్మీయత లేదు. కేవలం శరీర సంబంధులై శరీర కార్యములను నెరవేర్చుచున్నారు.

ఒకే స్థలములో (గ్రామములలో, చిన్న చిన్న టౌన్‌లలో, పేటలలో) రెండు, మూడు గ్రూపులవారు క్రీస్తు సంఘములు నెలకొల్పి అనైక్యతను నిరూపించుకొను చున్నారు. వారిమధ్య సహోదర ప్రేమలేదని నిరూపించుకొనుచున్నారు. ఒకరు అంటే ఒకరికి గిట్టుటలేదు. దీనికంతటికీ కారణం బైబిలు సత్యము తెలియక పోవుటయే.

దేవుడు సర్వసృష్టిని ఒక నియమబద్ధ ప్రకారం సృష్టించి నాడు-సూర్యుని, చంద్రుని, గ్రహములను, ఒక క్రమబద్ధముగా వాటి వాటి కక్ష్యలో తిరుగులాగున నియమించినాడు. అనగా వాటికి ఒక క్రమము ఏర్పరచినాడు. అవి క్రమము తప్పకుండా వున్నవి. కాని క్రీస్తు సంఘ బోధకులు క్రమము తప్పినారు. ఒకచోట క్రీస్తుసంఘము వుంటే దానిని ప్రోత్సాహపరచడం గాక దాని ప్రక్కన వేరొక క్రీస్తు సంఘము స్థాపించడం మొదటి దానిని అన్ని విధముల బలహీనత చేయడం, వాక్యమునకు విరుద్ధమైన సంగతి.

ఒకరి ఏరియాలోకి ఒకరు జొరబడి పనిచేయకూడదని పౌలు మహాశయులు చెప్పుచున్నారు. ఈ క్రింది వాక్యములను గ్రహించగలరని విశ్వసిస్తున్నాను. "మేమైతే మేరకు మించి అతిశయపడము గాని మీరున్న స్థలము వరకు రావలెనని దేవుడు మాకు కొలిచి యిచ్చిన మేరకు లోబడియుండి అతిశయించుచున్నాము. మేము క్రీస్తు సువార్త ప్రకటించుచు, మీ వరకును వచ్చియుంటిమి గనుక మీయొద్దకు

రావివారమైనట్లు మేము మా మేర దాటి వెళ్ళుచున్న వారము కాము. మేము మేరకు మించి యితరుల ప్రయాస ఫలములలో భాగస్తులమనుకొని అతిశయ పడము. మీ విశ్వాసము అభివృద్ధియైన కొలది మాకనుగ్రహింపబడిన మేరలకు లోపలనే సువార్త మరి విశేషముగా వ్యాపింపజేయుచు, మీ అవలి ప్రదేశములలో కూడ సువార్త ప్రకటించునట్లుగా, మేము మీ మూలముగా ఘనపరచబడుదుమని నిరీక్షించుచున్నామే గాని, మరియొకని మేరలో చేరి, సిద్ధమైయున్నవి మావియైనట్లు అతిశయింపగోరము. అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను. ప్రభువు మెచ్చుకొనువాడే యోగ్యుడు గాని తన్ను తానే మెచ్చుకొనువాడు యోగ్యుడు కాడు" (2కొరింథీ 10:13-18). గనుక క్రీస్తు సంఘ వ్యాప్తి మేరలను (సరిహద్దులను) గుర్తించి-వారివారి ప్రదేశములలో సువార్త సేవ చేయవలయును. ఒకరు పనిచేయుచున్న చోటున-వేరొకరు పనిచేయుట దేవుడు నియమించిన క్రమము తప్పుటయే అని గమనించవలయును. సర్వసృష్టిని క్రమములో పెట్టినవాడు ఇది కూడా (సువార్త సేవను) క్రమములో పెట్టినాడు. అట్టి క్రమమును గుర్తించి క్రీస్తు సంఘ వ్యాపకము జరుగవలెను.

ఒక స్థలములో పనిచేయుటకు నిశ్చయించుకొనినవాడు ఆ స్థలములో ఎవ్వరైననూ-క్రీస్తు సంఘములో పని చేయుచున్నారా ? లేదా ? తెలిసికొని లేని పక్షమున అచ్చోట పని ప్రారంభించవచ్చును. ఒకడు ఉన్నారని తెలిసినచో మరియొక చోటికి వెళ్లవలెను. ఇష్టము వచ్చినట్లు పనిచేయుట దేవుని క్రమము తప్పినట్లే. అట్టివారు క్రీస్తు సంఘము అని చెప్పుకొన్నను వారుకారని ఋజువు పరచబడుచున్నది. ఎందుకంటే ? "ఐక్యత" లేదు గనుక. క్రీస్తు సంఘము అయినవారు తప్పక ఐక్యత కలిగియుండవలెను. ప్రస్తుతము యీ విషయములో అమెరికా సహోదరులు గాని, మరి యే యితర దేశస్తులు గాని అవగాహనము లేకుండా పనిచేయుచున్నారు. ముఖ్యముగా వారే గ్రూపులుగా చీలి యిప్పటి క్రీస్తు సంఘములలో విభజనలు తెచ్చుచున్నారు.

విభజన అనునది క్రీస్తు సంఘములో లేదు (1కొరింథీ 1:10-13). ఇప్పటి క్రీస్తు సంఘములో విభజన వున్నచో ఏ ఒక్కరునూ పరలోకమునకు అర్హులు కారు (మత్తయి 13:41-42).

- గొరికపూడి జాన్సన్, తెనాలి.

సంఘచరిత్ర :

# ప్రొటెస్టాంటుల సవరణోద్యమమును గూర్చి కేథలిక్కుల స్పందన

## (Catholic Reaction to the Protestant Reformation)

**ప్రతికూల ఉద్యమము** (The Counter of Reformation) : అనేక దేశాల్లో ప్రొటెస్టాంటులు వ్యాప్తిజెందుటలో అలజడి నొందిన కేథలిక్కు సంఘము వారికి ప్రతికూల ఉద్యమము నారంభించెను. ట్రెంట్‌లో జరిగిన ప్రతినిధుల సభ (The Concil of Trent) 18 సంవత్సరముల మట్టుకు (క్రీ॥శ॥ 1545నుండి 1563 వరకు) కొనసాగినను, ధర్మ విచారణ కార్యక్రమముతో (Inquisition) పోపుల నైతిక పతనమును కొంతమట్టుకు అరికట్ట గలిగెను. తరువాత ఆ శతాబ్దపు చివరికి కేథలిక్కుల బలమంతయు ప్రొటెస్టాంటు ఉద్యమము నణచివేయుటకు సమీకరించబడెను. జెసూయిట్స్ అను గురువుల గుంపుతో ఏకమై తాను పోగొట్టుకొనిన భూ భాగమంతయు మరల సంపాదించుకో గలిగెను గాని లక్షలాది ప్రజలు నాశనమైరి.

**జర్మనీలో** : క్రీ॥శ॥ 1540 నాటికి ఉత్తర జర్మనీ అంతా లూథరన్ల దాయెను. చార్ల్స్ V చక్రవర్తి తన సైన్యమంతటితోను జర్మనీపై యుద్ధము ప్రకటించవలెనని పోప్ పాల్ III అనునతడు అభ్యర్థించెను. ఆ యుద్ధమును ఒక ధర్మదండయాత్రగా (Crusade) పోప్ ప్రకటించెను. మరియు దానిలో పాల్గొనిన వారికి పాపక్షమాపణ

పత్రములను (indulgences) జారీ చేసెను. ఈ యుద్ధము 9 సంవత్సరముల పాటు జరిగెను. చివరకు లూధరన్లకు అధికార ఆమోదము లభించెను.

నెదర్లాండ్స్‌లో : నెదర్లాండ్స్‌లో లూధరన్లు, ప్రెస్బిటేరియన్లు, అనాబాప్టిస్టులు బలము పుంజుకొనిరి. క్రీ॥శ॥ 1522 నాటికి చార్ల్స్ V చక్రవర్తి ధర్మ విచారణ (Inquisition) కార్యక్రమమును స్థాపించెను. 1535లో అనా బాప్టిస్టులకు అతడు అగ్ని మరణశిక్షను (Death by fife) విధించెను. 'ధర్మవిచారణ' జరిపిన రోమన్ కేథలిక్కు స్వాముల గుంపు అనగా జెసూయిట్స్ అను వారి సహాయముతో లక్ష మందికి పైగా క్రూరముగా చంపబడిరి. "కొందరు కొయ్యలకు గొలుసులతో కట్టబడి నెమ్మదిగా అగ్నితో కాల్చబడిరి; కొందరు కటిక చీకటి గుహలలో పడవేయబడిరి. కొరడాలతో కొట్టబడిరి, హింసింపబడి కాల్చబడిరి. స్త్రీలు చిన్న సైజుగల సమాధి పెట్టెలలోనికి క్రుక్కబడి, కాళ్లతో త్రొక్కబడి సజీవ సమాధి చేయబడిరి". యింత ఘోరశ్రమల నొందినను, చివరకు నెదర్లాండ్ 1609లో స్వాతంత్ర్యమును సంపాదించుకో గలిగెను.

ఫ్రాన్స్ : క్రీ॥శ॥ 1559 నాటికి హ్యూజినాట్ (Hugenot) ప్రొటెస్టాంటులను వారు నాలుగు లక్షలకు పైగా ఫ్రాన్స్ దేశములో యుండిరి. కేథలిక్కు స్వాముల దుష్ప్రవర్తనకు భిన్నముగా వీరు పవిత్ర జీవితమును జీవించిరి. 1572వ సంవత్సరము ఆగస్టు 24వ తేదీన 70 వేలమంది హ్యూజినాట్ ప్రొటెస్టాంటులు నిర్దాక్షణ్యముగా చంపబడిరి. క్రైస్తవ్యము పేరుతో యిదంతయు పోప్‌చే సంకల్పించబడి, నిర్వహించబడెను. దీనిని చరిత్రకారులు సెయింట్ బర్తొలోమ్యూ నరవధ (St. Bartholomew's massacre) అని చెప్పుదురు.

బొహిమియా : 40 లక్షల జనాభా గలిగిన ఈ ప్రాంతము 1600 సంవత్సరము నాటికి 80 శాతము ప్రొటెస్టాంటులైరి. జెసూయిట్స్ అనువారు, హేప్స్‌బర్గ్స్ అనువారు తమ చిత్రవధను పూరించు సరికి వారిలో 8 లక్షల మందియే మిగిలిరి. వారందరు కేథలిక్కులే.

ఆస్ట్రియా, హంగేరి : ఈ దేశాల్లో నూటికి యాభైమంది ప్రొటెస్టాంటులు. వారిలో అనేకమంది వధించబడిరి.

పోలాండ్ : 16వ శతాబ్దము నాటికి ఈ దేశములో రోమన్ కేథలిక్కులు లేకుండా పోయేటట్లు కనబడెను. అయితే "ధర్మవిచారణ" పద్ధతి వలన ఆ దేశములో సవరణోద్యమము చంపబడెను.

ఇటలీ : ప్రొటెస్టాంటుల అగ్నిజ్వాలలు వ్యాపించకుండా "ధర్మవిచారణ" అడ్డుకొనెను.

స్పెయిన్ : డొమెనీషియన్ మత గురువగు తార్కిమాడ (Torquemada) అనునతడు ఈ దేశములో సవరణోద్యమమును అణచివేసెను. 1481 నుండి 1808 వరకు లక్షమంది హతసాక్షులైరి మరియు 15 లక్షలమంది పరవాసులైరి. సవరణోద్యమము ప్రారంభించబడినప్పటికి ప్రపంచములో అతి శక్తివంతమైన దేశము స్పెయిన్. యిప్పుడు ప్రపంచములో పరిగణించదగినదిగా లేనందున పోపులు ఒక దేశమునకేమి చేయగలరో యనుదానికి సజీవసాక్షిగా అదియున్నది (రిఫరెన్సులన్నీ Halley's Hand book లోనివే).

గమనిక : ఈ హింసలు, వధలు ఆయుగానికి చెందినవేనా ? ఈ ఘోర నేరములను గూర్చి పోప్‌లు క్షమించబడగలరా ? అది ఎవరి యుగము ? దానినెవరు చేసారు ? అదంతా పోప్‌లదే. వెయ్యి సంవత్సరములకు పైగా లోకము వారినే వెంబడించాలని దానికి శిక్షణ యిచ్చారు. ప్రజలు దేవుని వాక్యమునే వెంబడించుచున్న యెడల సత్యము నెరిగియుందురు. గాని ప్రజల చేతిలో నాడు బైబిలు లేదు. క్రీస్తు ప్రతినిధులమని చెప్పుకొను పోపులకు క్రీస్తు ఆత్మలేదు. గనుక చిత్రవధకు తమ ఆమోదమునిచ్చేవారు. అది దయ్యపు ఆత్మయే.

అయితే అనేకులైన ప్రొటెస్టాంటులు కూడ, "అగ్నిని అగ్నితోనే పోరాడాలని" యెంచి, వారు కూడా హింసించారు, వారిది తప్పు. ఈ ఉద్యమము పేరున ప్రొటెస్టాంటులు వందలమందిని చంపితే కేథలిక్కులు లక్షలాది మందిని చంపారు.

# సవరణోద్యమము యొక్క మూల సూత్రములు
## (Principles of Reformation)

విశ్వాసమునకు; ఆచరణకు బైబిలు ఒక్కటి మాత్రమే ఆధారము. మరియు భావార్ధము చెప్పే హక్కు ప్రతివారికి యున్నది.

కేథలిక్కులు బోధించునట్లు క్రియలవలన మాత్రమే గాక, విశ్వాసమూలమున మాత్రమే ఒకడు నీతిమంతుడుగా తీర్చబడును (ఈరెండు బైబిలు విరుద్ధ బోధలే).

విశ్వాసులందరు యాజకులే, సంఘ కార్యక్రమములలో పాల్గొను స్వేచ్ఛ అందరికీ కలదు. యిది కేథలిక్కుల మత గురువుల పద్ధతికి భిన్నమైనది.

విశ్వాసికిని, క్రీస్తుకును మధ్య కేథలిక్కులుంచిన ప్రతి బంధకములను (స్వాములు, గురువులు, ప్రతిమలు, అవశేషములు మొదలుగునవి) తొలగించుట. ఒక మత గురువు యొక్క అనుమతి లేకుండా ప్రతివాడు సువార్త వినుటకు, లోబడుటకు యిది అనుకూలించినది.

బైబిలును పఠించుటలో విశ్వాసులందరు ఏకమవుట సాధ్యమగును.

——— 0 ———

# యెరూషలేము తట్టు నీ కిటికీలను తెరచి యుంచుము.
## ( Keep your Windows Open toward Jerusalem )

బబులోను రాజగు దర్యావేషు తన కాలములో ముప్పది దినముల వరకు తన యొద్ద తప్ప ఏ దేవుని యొద్దను, మానవుని యొద్దను ఎవడును ఏ మనవియు చేయకూడదు; ఎవడైనను చేసిన యెడల వాడు సింహముల గుహాలో పడద్రోయ బడునను శాసనమును జారీ చేసెను. "ఇట్టి శాసనము సంతకము చేయబడెనని

దానియేలు తెలిసి కొనినను అతడు తన యింటికి వెళ్లి యథా ప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్లుని, తన యింటి పైగది కిటికీలు యెరూషలేము తట్టునకు తెరువబడి యుండగా తన దేవునికి ప్రార్థన చేయుచు ఆయనను స్తుతించుచు వచ్చెను" (దానియేలు 6:7-10). తత్ఫలితముగా దానియేలు సింహముల గుహలో పడవేయబడెను. అయితే దేవుడు సింహముల నోళ్లు మూయించెను. గనుక అవి అతనికి ఏ హానియు చేయక పోయెను. దేవుని నామము చివరకు ఘనపరచబడెను.

క్రైస్తవుడైన ప్రతివాడు దానియేలు వలె ప్రార్థన జీవితమును జీవించ వలెను. ప్రార్థన లేకుండ దేవుని ఆశీర్వాదములను మనము సంపూర్తిగ పొందలేము. ప్రార్థన స్థానములో మనం మరొక దానిని యేమీ ఉంచలేము, అయితే ప్రార్థన అనగా యేమిటి ?

## ప్రార్థన అనగా ...

దేవుని బిడ్డ యైన క్రైస్తవుడు తండ్రి యైన దేవునితో సంభాషణ చేసే గొప్ప అవకాశమే ప్రార్థన, మరియు అతని హృదయాభిలాషను దేవునికి తెలియజెప్పే అవకాశము-ప్రార్థన. "సహోదరులారా, ఇశ్రాయేలీయులు రక్షణ పొందవలెనని నా హృదయాభిలాషయు, వారి విషయమై నేను దేవునికి చేయు ప్రార్థనయునై యున్నది" యని అపో.పౌలు పలికాడు (రోమా 10:1). దేవాలయమునకు వెళ్లిన సుంకరి, "దూరముగా నిలుచుండి ఆకాశము వైపు కన్ను లెత్తుట కైనను ధైర్యము చాలక రొమ్ము కొట్టుకొనుచు-దేవా పాపినైన నన్ను కరుణింపుమని పలికెను" (లూకా 18:13). ప్రార్థన కేవలం ధ్యానించుట మాత్రమే కాదు, లేదా ధ్యాన సంబంధమైన మనస్తత్వాన్ని మాత్రమే కలిగి యుండుట కాదు గాని, మన హృదయ తలంపులు మాటలతో దేవునికి విన్నవించుకొనుట ప్రార్థనలో జరగాలి. "నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును" అని యేసు ప్రభువు పలికారు (యోహాను 14:13). "మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన

దృష్టికి ఇష్టమైనవి చేయు చున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయనవలన మనకు దొరుకును" అని భక్తుడైన యోహాను వ్రాసాడు ( 1 యోహాను 3:22).

దేవుని గ్రంధమైన బైబిలును మనం చదువునప్పుడు దేవుడు మనతో మాట్లాడుచున్నాడు. అయితే మనం ప్రార్ధన చేయునప్పుడు దేవునితో మాట్లాడుదుము. మనం ప్రార్ధన చేయునప్పుడు దేవుని స్తుతించాలి. అందుకే, "పరలోకమందున్న మాతండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచ బడును గాక! " యని ప్రార్ధించుడని ప్రభువు తన శిష్యులకు నేర్పించారు (మత్తయి 6:9). ప్రార్ధనలో మనం దేవునికి కృతజ్ఞత చెల్లించాలి. "ఎల్లప్పుడును సంతోషముగా ఉండుడి; యెడతెగక ప్రార్ధన చేయుడి; ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" యని పౌలు చెప్పాడు (1థెస్స 5:16-18). తరువాత ప్రార్ధన చేయునప్పుడు మన తప్పిదములను, పాపములను దేవుని యొద్ద ఒప్పుకోవాలి. "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9). అంతే కాదు ప్రార్ధనలో మనం దేవునికి విజ్ఞాపన, యాచన చేయాలి. మనము మనుష్యులందరి కొరకు, రాజుల కొరకు, అధికారులందరి కొరకు విజ్ఞాపనములు, ప్రార్ధనలు, యాచనలు చేయాలి. ఇది మంచిదియు మన రక్షకుడైన దేవుని దృష్టికి అనుకూలముమైనదియునై యున్నది (1 తిమోతి 2:1-3).

"అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును. తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును. మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగిన యెడల వానికి రాతి నిచ్చునా? చేపను అడిగిన యెడల పామునిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవులనియ్య

నెరిగి యుండగా పరలోక మందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును" అని యేసు ప్రభువు బోధించారు (మత్తయి 7:7-11). గనుక ప్రార్థనలో మన అవుసరాలను దేవుని అడగాలి. అవి ఆయన చిత్త ప్రకారమును బట్టి యుండాలి.

అయితే ప్రార్థన చేయునప్పుడు దేవునికి తెలియజేస్తూ మానవునికి బుద్ధిచెప్పుచున్నట్లుండ కూడదు. ప్రార్థన చేయుటకై దేవాలయమునకు వెళ్లిన పరిసయ్యుడు నిలబడి "దేవా, నేను చోరులును, అన్యాయస్థులును, వ్యభిచారులునైన యితర మనుష్యుల వలెనైనను, ఈ సుంకరి వలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచు, నా సంపాదన అంతటిలో పదియవ వంతు చెల్లించు చున్నానని" ప్రార్థన చేసెను. గాని దేవుడతని నీతిమంతునిగా తీర్చలేదని యేసుప్రభువు చెప్పారు (లూకా 18:9-14).

మన స్వకీయ దురాశలను తీర్చుకొనుటకు ప్రార్థన చేయరాదు, భక్తుడైన యాకోబు ఇట్లు వ్రాయుచున్నాడు: "మీలో యుద్ధములును పోరాటములును దేనినుండి కలుగు చున్నవి? మీ అవయవములలో పోరాడు మీ భోగేచ్ఛల నుండియే గదా? మీరాశించు చున్నారు గాని, మీకు దొరుకుట లేదు; నరహత్య చేయుదురు, మత్సర పడుదురు గాని సంపాదించు కొనలేరు, పోట్లాడుదురు యుద్ధము చేయుదురు గాని దేవుని అడుగనందున మీ కేమియు దొరుకదు, మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీ కేమియు దొరుకుట లేదు" (యాకోబు 4:1-4).

మనకేమైనా ఆపద గాని, విపత్తుగాని సంభవించినప్పుడే దేవునికి విజ్ఞాపన చేయుట ప్రార్థన కాదు. అన్నివేళలా, సుఖ దుఃఖముల యందు మనం దేవుని ప్రార్థించాలి.ఆపదలలో ప్రార్థించి, వాటి నుండి గట్టెక్కగానే దేవుని మరచిన యెడల, "మీకు కష్టమును దుఃఖమును ప్రాప్తించు నప్పుడు నేను అపహాస్యము చేసెదను.

అప్పుడు వారు నన్ను గూర్చి మొఱ్ఱ పెట్టెదరు గాని నేను ప్రత్యుత్తర మియ్య కుందును. నన్ను శ్రద్ధగా వెదకెదరు గాని నేను వారికి కనబడకుందును" అని ఆయన సెలవిచ్చుచున్నారు (సామె 1:27, 28).

దేవుడు మనలను యేమి చేయాలని కోరుకున్నారో, దాన్ని చేయకుండా తప్పించుకొనే మార్గము ప్రార్ధన కాదు. మనం ప్రార్థించాలి, పని చేయాలి.ఆయన చిత్తమును జరిగించాలి. "ప్రభువా, ప్రభువా అని పిలుచు ప్రతివాడునుపరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని, పరలోకమందున్న నాతండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమున అనేకులు నన్ను చూచి, ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములు వెళ్ల గొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా ? అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడును ఎరుగను, అక్రమము చేయువారలారా, నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును" అని యేసుప్రభువు పలికారు(మత్తయి 7:21-23).

పలికిన మాటలనే పదేపదే వల్లించుట ప్రార్ధన కాదు. ప్రభువు తన శిష్యుల కిచ్చినది ఒక మాదిరి ప్రార్ధనే గాని, దానినే మనం వల్లించాలని ఆయన బోధించ లేదు. దేవుడు శర్వశక్తి మంతుడని, సమస్తాన్ని ఎరిగి మన అక్కరలను తీర్చగల వాడని, ఆయన లేకపోతే మన ఉనికియే సాధ్యము కాదని, అన్నింటికీ మనం ఆయన పైనే ఆధారపడి యున్నామని గుర్తెరిగి ఆయన దగ్గిర మనం దీనులమై యుండుటయే నిజమైన ప్రార్ధన.

## ప్రార్ధన ఎప్పుడు చేయాలి ?

ఇంతవరకు ప్రార్ధనను గూర్చి కొంత తెలిసి కొన్నాము. క్రైస్తవుడైన ప్రతివాడు ప్రార్ధన జీవితాన్ని జీవించాలి. మన అవుసరాల కొలదీ ప్రార్థించుదము. మనం ఆశీర్వదించ బడిన కొలదీ ప్రార్ధనలో దేవునితో సంభాషించుదము. అయితే ఎంత తరుచుగా మనం ప్రార్ధన చేయాలి? దినంలో ఎప్పుడెప్పుడు ప్రార్ధన చేయాలి ? తెలిసికొందాము.

మనం ఎడతెగక ప్రార్థన చేయాలి. "నిరీక్షణ గలవారై సంతోషించుచు శ్రమయందు ఓర్పు గలవారై, ప్రార్థనలయందు పట్టుదల కలిగియుండుడి" యని రోమా 12:12 లో వ్రాయబడియున్నది. "ప్రార్థన యందు నిలకడగా ఉండి కృతజ్ఞత గలవారై దానియందు మెలకువగా యుండుడి" యని కొలస్స 4:2 చెప్పుచున్నది. "యెడతెగక ప్రార్థన చేయుడి; ప్రతి విషయము నందు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి; ఈలాగు చేయుట యేసు క్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము" అని 1 థెస్స 5:17-18లో వ్రాయబడి యున్నది. ఒకడు దినమంతా ప్రార్థన చేస్తూనే యుండాలని ఈ లేఖన భాగముల ఉద్దేశ్యము కాదు. లూకా 11:1 లో "యేసు యొక చోట ప్రార్థన చేయుచుండెను. ప్రార్థన చేయుట చాలించిన తరువాత... " అని వ్రాయబడి యున్నది. మనం తరుచు ప్రార్థించాలి; నిర్ణీత సమయాల్లో ప్రార్థించాలి, ఎల్ల వేళల ప్రార్థించే మనస్సు కలిగి యుండాలి. కీర్తన 55:17 లో "సాయంకాలమున ఉదయమున, మధ్యాహ్నమున నేను ధ్యానించుచు మొఱ్ఱ పెట్టుకొందును. ఆయన నా ప్రార్థన నాలకించును" అని వ్రాయబడి యున్నది.

ఉదయమున పడకనుండి లేవగానే ప్రార్థించండి. భోజనమునకు ముందు ప్రార్థించండి, "దీనులు భోజనము చేసి తృప్తి పొందెదరు. యెహోవాను వెదకు వారు ఆయనను స్తుతించెదరు.. భూమి మీద వర్ధిల్లు చున్నవారందరు అన్న పానములు పుచ్చుకొనుచు నమస్కారము చేసెదరు" అని 22వ దా.కీర్తనలో వ్రాయబడి యున్నది(కీర్తన 22:26,29). నిర్ణీత సమయాల్లో ప్రార్థించుట అలవాటు చేసుకొనుట మంచిది. మీ కుటుంబముతో కలిసి ప్రార్థించండి. కలిసి ప్రార్థించే కుటుంబము, కలిసి మెలిసి యుంటాది. రాత్రి పండు కొనక ముందు ప్రార్థించండి. "నా మంచము మీద నిన్ను జ్ఞాపకము చేసికొని రాత్రి జాముల యందు నిన్ను ధ్యానించునప్పుడు క్రొవ్వు మెదడు నాకు దొరకినట్లు నా ప్రాణము తృప్తి పొందు చున్నది" యని దావీదు పలికాడు (కీర్త 63:4, 5).

మీరు సంతోషముగా యున్నప్పుడు ప్రార్ధించండి: దుఃఖములో యున్నప్పుడు ప్రార్ధించండి; నిరుత్సాహముగా యున్నప్పుడు ప్రార్ధించండి; బాధింపబడు చున్నప్పుడు ప్రార్ధించండి, అన్నివేళలా ప్రార్ధించండి, ప్రార్ధించుట అలవాటయ్యేవరకు ప్రార్ధించండి.

## ప్రభువు మాదిరి

యేసుప్రభువు గొప్ప ప్రార్ధనా పరులు, "ఆయన పెందల కడనే లేచి ఇంకను చాల చీకటి యుండగానే బయలు దేరి, అరణ్య ప్రదేశమునకు వెళ్లి అక్కడ ప్రార్ధన చేయుచుండెను" (మార్కు 1:35). "ఆదినముల యందు ఆయన ప్రార్ధన చేయుటకు కొండకు వెళ్లి దేవుని ప్రార్ధించుట యందు రాత్రి గడిపెను" అని లూకా 6:12 లో వ్రాయబడి యున్నది. యోహాను సువార్త 17వ అధ్యాయములో యేసు ప్రభువు చేసిన అసలైన ప్రార్ధన వ్రాయబడి యున్నది.

యేసు ప్రభువు బాప్తిస్మము పొందగానే ప్రార్ధించెను (లూకా 3:21). ఆయన అనేక రోగులను స్వస్థపరచిన తరువాత "ప్రార్ధన చేయుటకు అరణ్యములోనికి వెళ్లుచుండెను" (లూకా 5:16). ఆయన పేతురును యోహానును యాకోబును వెంట బెట్టుకొని ప్రార్ధన చేయుటకు ఒక కొండ యెక్కెను. అక్కడ రూపాంతరము పొందెను (9:28,29). ఆయన సిలువ వేయబడక ముందు గెత్సమనే వనములో ప్రార్ధన చేయుచు రాత్రిగడిపెను (మత్తయి 26: 36-44).

## ఆదిమ సంఘ మాదిరి

ఆదిమ క్రీస్తు సంఘము ప్రార్ధన పూర్వకమైన వారు. "వారు అపొస్తలుల బోధయందును సహవాస మందును, రొట్టె విరుచుట యందును, ప్రార్ధన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:47). పేతురు యోహానులు నజరేయుడైన యేసుక్రీస్తని మానవుల రక్షకుడని భోధించుచుండగా యూదుల ప్రధాన యాజకులును పెద్దలును వారిని పిలిపించి "ఇక మీదట ఈ నామమును

బట్టి యే మనుష్యులతో నైనను మాటలాడ కూడదని" వారిని బెదిరించిరి. అయితే వారు వచ్చి ఈ సంగతులను సంఘమునకు తెలియ జేయగా సంఘమంతయు కలిసి ప్రార్థించిరి. "ప్రభువా, ఈ సమయమందు వారి బెదరింపులు చూచి, రోగులను స్వస్థ పరచుటకును, నీ పరిశుద్ధసేవకుడైన యేసు నామము ద్వారా సూచక క్రియలను మహత్కార్యములను చేయుటకు నీచెయ్యి చాచి యుండగా, నీ దాసులు బహు ధైర్యముగా నీ వాక్యమును బోధించునట్టు అనుగ్రహించుము. వారు ప్రార్థన చేయగానే వారు కూడియున్న చోటు కంపించెను; అప్పుడు వారందరు పరిశుద్ధాత్మతో నిండిన వారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి" (అపొ.కా. 4:13-31).

దాదాపు ఆదేకాలమందు రాజైన హేరోదు అపొస్తలుడైన యాకోబును ఖడ్గముతో చంపించెను, ఇది యూదుల కిష్టమైన కార్యమని తెలిసికొని పేతురును కూడ పట్టుకొనెను. పేతురు చెరసాలలో ఉంచబడెను, సంఘమయితే అతని కొరకు అత్యాసక్తితో దేవునికి ప్రార్థన చేయుచుండెను. ప్రభువు ఆశ్చర్య రీతిగా ఆరాత్రి పేతురును చెరసాల నుండి విడిపించెను (అపొ.కా. 12:1-12).

క్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించు చున్నందున ఫిలిప్పయి పట్టణస్థులు పౌలు, సీలాలను పట్టుకొని వారి వస్త్రములు లాగివేసి వారిని బెత్తములతో కొట్టి చెరసాలలోనికి త్రోసి, వారి కాళ్లకు బొండ వేసి బిగించిరి. అయితే మధ్యరాత్రి వేళ పౌలును సీలయు దేవునికి ప్రార్థించుచు కీర్తనలు పాడుచుండిరి. ఖయిదీలు వినుచుండిరి (అపొ.కా. 16:19-25). ఈ రీతిగా ఆదిమ సంఘము సుఖ దుఃఖముల యందు, శ్రమల యందు ప్రార్థన చేసి క్రీస్తు కొరకు గొప్ప ఫలితములను పొందినట్లు మనము చూడగలము. నేటి క్రీస్తు సంఘములు కూడ గొప్ప ప్రార్థన సంఘములుగా తయారుకావాలి. అప్పుడు ఆయన కొరకు గొప్ప కార్యములను సాధించగలము.

24.

# విశ్వాస వీరుల మాదిరి

బైబిలులో మనం కనుగొను గొప్ప విశ్వాస వీరులందరు గొప్ప ప్రార్థనా పరులే. అబ్రాహాము, దావీదు, మోషే, హన్నా, నెహెమ్యా మొదలగు వారు గొప్ప ప్రార్థన జీవితాన్ని గడిపినవారు. దావీదు వ్రాసిన కీర్తనలు అనేకములు ప్రార్థన గీతములే. "యెహోవా, నాకు రక్షణ కర్తవగు దేవా, రాత్రివేళ నేను నీ సన్నిధిని మొర్రపెట్టునాడు నా ప్రార్థన నీసన్నిధి చేరును గాక. నామొర్రకు చెవి యొగ్గుము, నేను ఆపదలలో నిండియున్నాను" అని అతడు ప్రార్థించాడు (కీర్తన 88:1-3).

శ్రమలలో యుండగా దావీదు ఇట్లు ప్రార్థించాడు: "యెహోవా నేను దీనుడను, దరిద్రుడను, చెవియొగ్గి నాకుత్తర మిమ్ము... ప్రభువా, దినమెల్ల నీ కొరకు మొర్ర పెట్టుచున్నాను నన్ను కరుణింపుము... ప్రభువా, నీవు దయాళుడవు క్షమించుటకు సిద్ధమైన మనస్సు గలవాడవు, నీకు మొర్ర పెట్టు వారందరి యెడల కృపాతిశయము గలవాడవు... ప్రభువా నీవు మహాత్మ్యము గలవాడవు, ఆశ్చర్య కార్యములు చేయువాడవు. నీవే అద్వితీయుడవు. ప్రభువా దేవతలలో నీవంటి వాడెవడును లేడు. నీ కార్యములకు సాటియైన కార్యములు లేవు.... నా పూర్ణ హృదయముతో నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను, నీనామమును నిత్యము మహిమ పరచెదను" (86వ దా.కీర్తన).

అద్వితీయ సత్యదేవుని ఏకైక కుమారుడైన యేసు ప్రభువునందు విశ్వాస ముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది ఆయన కుటుంబములో ఒక సభ్యునిగ ప్రవేశించుము. అప్పుడు పరలోక మందున్న దేవుడు నీ తండ్రి యగును. ఆయనను ప్రార్థించే తరుణము నీకును లభ్యమగును!!

✿ ✿ ✿

సంక్షిప్త ప్రసంగము

# పాపము (Sin)

**పరిచయము :**

1. పాపమనగా యేమిటో అనేక భావాలున్నాయి.
2. మానవులు పాపానికి తమ స్వంత నిర్వచనాన్ని యిచ్చారు. పెద్ద పాపము, చిన్న పాపము అని వారు చెబుతారు.
3. పాపమును గూర్చిన సత్యం కొరకు బైబిలు నొద్దకు వెళ్ళాలి.

**పాపమనగా యేమిటి?**

1. ఆజ్ఞాతిక్రమమే పాపము. 1 యోహాను 3:4
2. సమస్త దుర్నీతియు పాపము. 1 యోహాను 5:17
3. విశ్వాస మూలము కానిది ఏదో అది పాపము. రోమా 14:23
4. మేలైనది చేయనెరిగియు దాన్ని చేయకుండుట పాపము. యాకోబు 4:17 - తప్పు జరిగించుట, దుష్టత్వము, దుర్నీతి, భక్తి హీనత, దుర్మార్గత మొదలగునవి పాపము.

**మొదటి పాపులెవరు?**

1. మానవులలో మొదటి పాపులు ఆదాము హవ్వలు.
2. వారు దేవుని చిత్తాన్ని అతిక్రమించారు. ఆది 3:1-19
3. నాటి నుండి నేటివరకు మానవుడు పాపియే.

**పాపానికి కర్త యెవడు?**

1. దేవుడు కాదు.
2. గాని సాతానుడే. ఆది 3:1-19
3. సర్పము హవ్వను మోసం చేసింది. 2 కొరి 11:3 - పాపంలో పడవేసింది.
4. అపవాది మానవజాతి శత్రువు

**పాపులకు తండ్రి యెవడు?**

1. అపవాది. యోహాను 8:34-44
2. అపవాది సంబంధులు అతని సేవ చేయుదురు. యోహా 8:43

**పాపమువలన అపరాధులెవరు?**

1. అందరు పాపము చేసిన వారే. రోమా 3:23
2. మాలో పాపము లేదను వారు అబద్ధికులు. 1 యోహా 1:8-10
3. అందరు పాపులే. రోమా 5:8-12

**మానవుడెందుకు పాపము చేస్తాడు?**

1. వివిధ కోరికలు ఆశలు శోధనలోనికి నడిపిస్తాయి. యాకో 1:14, 4:1-4.
2. తనకు లేనిదాన్ని మానవుడు పొందాలని ఎల్లప్పుడు కోరుచు యుంటాడు.
3. శోధనకు లొంగి మానవుడు పాపంచేస్తాడు. 1 యోహా 2:16

**ముగింపు :**

1. పాపము ఒక ఘోరమైన జబ్బు.
2. పాపమువలన వచ్చు జీతం మరణం. రోమా 6:23.
3. పాపానికి విరుగుడు యేసుక్రీస్తే.
4. ఆయన యిచ్చు నిత్య జీవాన్ని అందరం పొందుదుముగాక. యోహాను 8:24, లూకా 13:3, అపొ.కా. 2:38.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001.

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam